# సమ్మెట వేటు

పోతనామాత్యుడు తను రాసిన మహాభాగవతాన్ని రాజులెవరికీ అంకితమివ్వక యముని సమ్మెట వేటు పడకుండా కాపాడుకున్నాడు. కానీ ఒక ఫ్యాక్టరీ యజమానీ .. అతనూ పోతన్నే! తన కార్మికుల 'సమ్మె'ట వేటునుండి తప్పించుకోలేకపోయాడు. ఇంగ్లీషువాడు నేర్పిన 'విభజించి పాలించు' సూత్రాన్ని వ్యతిరేకించిన మన నాయకులు అదేసూత్రాన్ని స్వాతంత్ర్యం వచ్చాక కూడా అమలు చేస్తున్నట్టుగానే .. పోతన్న అనే ఒక ఫ్యాక్టరీ యజమాని అమలు చేస్తున్నాడు. ఒక యూనియన్ సమ్మె చేస్తే, రెండో యూనియన్ చేయకపోవడం.. ఇలా 'విభజించు పాలించు' సూత్రాన్ని అతి చాకచక్యంగా అమలుచేస్తూ, సమ్మె విఫలం అయ్యేటట్లు చేస్తూ ఉత్పత్తి కుంటుపడకుండా జాగ్రత్తపడుతున్నాడు. పోతన్నగారి నక్కజిత్తుల్ని చిత్తుచేస్తూ ఇద్దరు విభిన్న కార్మిక నాయకులు ఒక అవగాహనకొచ్చి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం సమ్మె చేస్తున్నప్పుడు.. యజమానితోను లేబర్ ఆఫీసర్‌తోను సంప్రదింపులు జరిగినప్పుడు ఉభయనాయకులు ఆ చర్చల్లో పాల్గొని ఒప్పందం కుదుర్చుకోవాలి. విడిగా ఏ నాయకుడూ ఒప్పందం మీద సంతకం చేయకూడదు. యజమాని పెట్టే ఎట్టి ప్రలోభాలకూ లొంగిపోకూడదు. అంతవరకూ సమ్మె విరమించకూడదు.

సమ్మె నోటీసు జారీ చేశాక సంప్రదింపులకు పిలిచారు లేబర్ ఆఫీసర్ సంప్రదింపులు విఫలమయ్యాయి. కాలవ్యవధి అయిపోగానే సమ్మెకు దిగారు కార్మికులు. ఫ్యాక్టరీ యజమాని పోతన్నను ఉద్దేశించి 'దున్న' పోతన్న మొండివైఖరి నశించాలి! దున్నపోతన్న కొమ్ములు విరిచేస్తాం! దున్నపోతన్న ఆటలు ఇంకానా? ఇకపై సాగవు! అంటూ గోడలమీద నినాదాలు రాయించారు. మేడేనాడు పెద్ద ఊరేగింపు తీశారు. మిగతా కార్మిక సంఘాలన్నీ పోతన్నగారి ఫ్యాక్టరీ కార్మికులకు మద్దతు ప్రకటించాయి. యజమాని దిగొచ్చినట్టు మెట్టు దిగాడు. కార్మిక నాయకుల్ని సంప్రదింపులకు పిలిచాడు. ఒక పక్క సమ్మె జరుగుతుండగానే రెండు యూనియన్ల నాయకులు సంప్రదింపులకు వెళ్లారు.

లేబర్ ఆఫీసర్ మధ్యవర్తిత్వంలో సంప్రదింపులు కొనసాగాయి. ఇద్దరు యూనియన్ నాయకులూ మేనేజ్‌మెంట్‌తో ఒప్పందానికి వచ్చారు. సంతకాలు చేశారు. యజమాని గత ఆరునెలలనుంచి ఇవ్వని ఒక విడత కరవుభత్యాన్ని తక్షణమే విడుదల చేస్తానన్నాడు.

కార్మిక నాయకులిద్దరూ మందహాసంతో బయటకు వచ్చారు. విజయాన్ని సూచించే 'వి' సైన్ రెండువేళ్లతోనూ చూపెట్టారు. బయట నిల్చుని సంప్రదింపులు ఫలితాన్ని తెలుసుకుందామని కార్మికులు ఉవ్విళ్లూరుతుండగా... 'సోదరులారా! నేటినుండి మనం సమ్మె విరమిస్తున్నాం. దున్నపోతన్నగారు, సారీ! పోతన్నగారు మనకి గత ఆరునెలలుగా నిలిపి ఉంచిన కరవుభత్యం విడుదల చేస్తున్నారు. ఈ మేరకు లేబరాఫీసర్ వారి సమక్షంలో ఒప్పందం కుదిరింది. మిగిలిన అంశాలు పరస్పరం సంభాషణల ద్వారా పరిష్కరించుకోవాలని కూడా ఒప్పందం కుదిరింది'' అని మైకులో బిగ్గరగా ఎనౌన్స్ చేశారు. "కార్మికుల ఐక్యతా వర్ధిల్లాలి!'' అంటూ నినాదాలు మిన్నుముట్టాయి. మర్నాటినుంచి యంత్రాలన్నీ చకచకా పని చేశాయి. కార్మిక నాయకులిద్దరినీ ఒక రోజున ఘనంగా సన్మానించారు. కార్మిక సోదరులు ఇద్దరికీ పర్సు కూడా ప్రజెంట్ చేశారు. ఉపన్యాసాలూ, కృతజ్ఞతలూ, వందన సమర్పణలూ అయ్యాక సభ ముగిసింది.

మర్నాడు నాకు అత్యంత సన్నిహితుడైన కార్మిక నాయకుణ్ణి కలుసుకుందిక వెళ్లాను. "ఇంతకీ మీరు సాధించినదేమిటో నాకు అర్థం కాలేదయ్యా!'' అన్నాను. "అదేమిటి? గర్భిణీ స్త్రీలకు ప్రసవానికి ఒకనెలా, ప్రసవం తరువాత ఒక నెలా, జీతం నష్టం లేకుండా సెలవు మంజూరు చేయడానికి ఒప్పందం కుదిరింది కదా!'' అన్నాడు.

"అంతేనా?''

"ఎనిమిది గంటలకంటే ఎక్కువ పనిచేయిస్తే ఓవర్‌టైమ్ ఇవ్వాలని ఒప్పందం కుదిరింది!''

"ఇంకా?''

"డ్యూటీలో ఉన్నప్పుడు ప్రమాదవశాత్తు కార్మికుడు/ కార్మికురాలు చనిపోతే వారి వారసునకు పని కల్పించడానికి ఒప్పందం కుదిరింది.''

"అదేమిటి? ఈ ఒప్పందం మూడేళ్ల క్రిందటే మీరు సమ్మె చేసినప్పుడు కుదిరిందేకదా!''

"నిజమే! కాని మూడేళ్ల క్రిందట కుదిరిన ఒప్పందం అమలు చేయకపోవడం వల్ల ఇప్పుడు సమ్మెం చేశాం. ఆ ఒప్పందం అమలు చేయడానికి ఈ ఒప్పందం కుదిరింది'' అన్నాడా నాయకుడు

"ఇంతకుముందు జరిగిన ఒప్పందాలు అమలు చేయడానికి ఒప్పందాలు గత పదేళ్లనుంచే జరుగుతున్నాయి అన్నగారూ!'' అంటూ మా సంభాషణ మధ్య జోక్‌చేస్తూ జోక్యం చేసుకుంది కార్మికుని శ్రీమతి. ఈ వ్యంగ్యాస్త్రానికి ముగ్గురం హాయిగానవ్వుకున్నాం.

23-6-2002

**ఆదివారం ఆంధ్రప్రభ**